క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 38, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండ 28, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 12, ఆలుగడ్డ 20, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 55, సొరకాయ 7, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సన్మానం



మణిమాలను సత్కరిస్తున్న కోటంరెడ్డి వినయ్‌రెడ్డి

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తోట మణిమాలను హాథ్ సే హాథ్ యాత్ర సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటంరెడ్డి వినయ్‌రెడ్డి సన్మానించారు. అమీర్‌పేట జిగ్యాస స్టూడియోలో జరిగిన నియోజకవర్గ స్థాయి నాయకుల సమావేశంలో ఆమెను శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి తెలుపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టాలన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

లిబర్టీ: సాహిత్య రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన గొప్ప రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ అని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ అన్నారు. ప్రపంచంలోనే రవీంద్రనాథ్ ఠాగూర్ రచయితగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి పురస్కరించుకుని లిబర్టీ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర ఉద్యమం ఉవ్వెత్తుగా సాగుతున్న క్రమంలో జనగణ గీతాన్ని రచించి దేశ ప్రజల హృదయాలను ఉత్తేజాన్ని నింపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, అరుణరెడ్డి, నంది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ స్టేడియానికి తరలిన బీఎస్పీ నేతలు

బంజారాహిల్స్: సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం జరిగిన చలో హైదరాబాద్ తెలంగాణ భరోసా సభకు తెలంగాణ ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఎస్పీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. దారిపొడవునా బీఎస్పీ జిందాబాద్ నినాదాలతో దద్దరిల్లింది. బంజారాహిల్స్ డివిజన్ బీఎస్పీ అధ్యక్షుడు గద్దెల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి బైండ్ల శ్రీనివాస్, జానకిరాం, ప్రతాప్, ప్రశాంత్, టి.స్వామి ఆధ్వర్యంలో బీఎస్పీ జెండాలు ఎగురవేస్తూ ర్యాలీగా వెళ్లారు.

చిన్నారితో అసభ్య ప్రవర్తన

యువకుడిపై కేసు

పంజగుట్ట: ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఓ బైక్ క్యాబ్‌డ్రైవర్ శనివారం రాత్రి సుమారు 10.30 లకు ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ వద్ద కస్టమర్‌ను పికప్ చేసుకుంటున్న క్రమంలో అక్కడ ఓ యువకుడు చిన్నారిపట్ల అసభ్యంగా ప్రవర్తించడం గమనించాడు. ఏం చేస్తున్నావని ప్రశ్నించగా సదరు బాలిక తన కూతురు అని చెప్పాడు. అనుమానం వచ్చిన బైక్ క్యాబ్ డ్రైవర్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడకు చేరుకున్న పోలీసులు బాలికను ప్రశ్నించగా ప్రైవేట్ భాగాల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని పేరు అఫ్రోజ్‌ఖాన్ (19) పండ్ల వ్యాపారిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నమో హైదరాబాద్ లోగో' ఆవిష్కరణ



బంజారాహిల్స్: ప్రధాని నరేంద్ర మోదీ పథకాలకు స్ఫూర్తి పొందిన హైదరాబాద్‌కు చెందిన యువత గ్రూప్‌గా ఏర్పాటై నమో హైదరాబాద్‌ను స్థాపించారు. ఈ లోగోతో పాటు వెబ్‌సైట్‌ను ఆదివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో బీజేపీ జాతీయ మహిళా మోర్చా సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, సంస్థ అధ్యక్షులు ఆజాద్‌బాబు, కన్వీనర్ అశోక్ పట్నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆజాద్‌బాబు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఉన్న యువత దగ్గరకు మోదీ భావజాలాన్ని తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దామని ఇందుకు హైదరాబాద్‌ను వేదికగా చేసుకున్నామన్నారు.

తెగని నీటి పంచాయితీ!



కంటోన్మెంట్: కంటోన్మెంట్ నీటి కష్టాలు ఎడతెరిపి లేని సీరియల్‌ను తలపిస్తున్నాయి. సొంతంగా నీటి వనరులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జలమండలి ద్వారా నీటిని కొనుగోలు చేసి స్థానికులకు సరఫరా చేస్తున్నారు. అయితే కంటోన్మెంట్‌కు సరఫరా చేసే నీటి విషయంలో వ్యాపారాత్మక ధోరణి ప్రదర్శిస్తున్న జలమండలి తీరుతో బోర్డు నీటి కష్టాలు తీరడం లేదు. నెలనెలా బిల్లులు చెల్లిస్తున్నా తీరని బకాయిలు, అదనపు వడ్డన, వడ్డీలకు తోడు కనెక్షన్ ఛార్జీల పేరిట మళ్లీ బిల్లులు చెల్లించాలనడంతో ఎటూ పాలుపోని దుస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ వాసులకు ఉచితంగానే నీటిని అందజేస్తున్నప్పటికీ, అదనపు నీటికి కొత్తగా కనెక్షన్ ఛార్జీలు అడగడంపై బోర్డు అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఏళ్ల తరబడి జలమండలి వద్దే తాము నీటిని కొనుగోలు చేస్తున్నప్పటికీ మళ్లీ కనెక్షన్ ఛార్జీలు ఎందుకు చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు.

ఆది నుంచీ అదే తీరు..

2004 నాటికే కంటోన్మెంట్ జలమండలికి చెల్లించాల్సిన నీటి బిల్లుల బకాయిలు రూ.2 కోట్లకు పైగానే ఉండేవి. దీంతో కంటోన్మెంట్ ప్రాంతంలోని ప్రజలకు నీటి సరఫరా బాధ్యతను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికే అప్పగించాల్సిందిగా బోర్డు తీర్మానం కూడా చేసింది. అయితే వివిధ కారణాల వల్ల ఈ ప్రక్రియ అర్ధంతరంగానే నిలిచిపోయింది. ఇదిలా ఉండగానే 2008లో రాష్ట్ర ప్రభుత్వం నీటి బిల్లులను పెంచడంతో పాటు గన్‌రాక్, మహేంద్రాహిల్స్, కార్ఖానా రిజర్వాయర్‌లకు కొత్తగా రూ.14కోట్ల కనెక్షన్ చార్జీలు చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో 2016 నాటికే నీటి బిల్లుల బకాయిలు రూ.56 కోట్ల మార్కును దాటాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు నీటి సరఫరా నిలిపివేస్తామంటూ రెడ్ నోటీసులు జారీ చేసింది. అప్పటి బోర్డు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అదనపు బిల్లులు అంశాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే కనెక్షన్ చార్జీలు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసిన మంత్రి, నీటి బిల్లుల బకాయిల్లో రూ.15 కోట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో వడ్డీయే రూ.7.5 కోట్లు ఉండటం గమనార్హం.

మళ్లీ పెరిగిన బకాయిలు..

ఏకంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి హామీ ఇచ్చినప్పటికీ జలమండలి మాత్రం అదనపు బిల్లులు పంపడంలో తన తీరు మార్చుకోలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో బస్తీలకు కిలో లీటర్‌కు రూ.7.5 చొప్పున కాలనీలకు రూ.13.5 చొప్పున వసూలు చేస్తుండగా, కంటోన్మెంట్ నుంచి మాత్రం బస్తీలకు సైతం రూ.13.5 చొప్పున బిల్లులు పంపుతూ వచ్చింది. ఈ విషయంలో 2019లో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి జోక్యం చేసుకుని జలమండలి అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎట్టకేలకు ఇటీవలే అదనపు చార్జీల భారాన్ని సవరించడంతో కంటోన్మెంట్‌కు రూ.37 కోట్ల ఊరట లభించింది.

రూ.17 కోట్లు చెల్లిస్తేనే...

2004లో కంటోన్మెంట్‌కు రోజుకు 37 లక్షల గ్యాలన్ల చొప్పున నీటిని సరఫరా చేసే వారు. 2014లో ఈ పరిమితిని 59 లక్షల గ్యాలన్లకు పెంచినప్పటికీ ప్రస్తుత జనాభా అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఈ పరిమితిని 73 లక్షలకు పెంచాల్సిందిగా కంటోన్మెంట్ అధికారులకు ఇటీవలే జలమండలిని కోరారు. అయితే అదనపు కోటా నీటి విడుదల చేయాలంటే రూ.17 కోట్లు కనెక్షన్ ఛార్జీల పేరిట అదనపు బిల్లు చెల్లించాల్సిందేనని జలమండలి అధికారులు తేల్చి చెప్పారు. దీంతో ఇప్పటికే పేరుకుపోయి ఉన్న బకాయిలు రూ.19 కోట్లకు అదనంగా ఈ ఛార్జీలు ఎలా చెల్లించాలో బోర్డు అధికారులకు తోచడం లేదు. దీనికి తోడు పదేళ్ల క్రితం నాటి కార్ఖానా, హస్మత్‌పేట, గన్‌రాక్ పంప్‌హౌజ్‌ల కనెక్షన్ చార్జీలు రూ.25.78 కోట్లు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే జలమండలి నుంచి బల్క్ వినియోగదారుగా ఉన్న తాము అదనపు కనెక్షన్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం ఏంటని బోర్డు అధికారులు వాదిస్తున్నారు. కంటోన్మెంట్‌లో నివాసముండే రాష్ట్ర మంత్రులు, ఇతర పాలక వర్గానికి చెందిన నేతలు చొరవ చూపి ఈ సమస్యను పరిష్కరిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

రాకపోకలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసుకోండి

కొలిక్కి వచ్చిన అన్నానగర్ ట్రాఫిక్ సమస్య



క్రిశాంక్‌తో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్న ట్రాఫిక్ ఉన్నతాధికారులు

కంటోన్మెంట్: అన్నానగర్‌లో పార్కింగ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. అన్నానగర్ చౌరస్తా నుంచి బీరప్ప గుడి మార్గంలో స్థానికులు రోడ్డుకిరువైపులా నిలుపుతున్న వాహనాలకు స్థానిక పోలీసులు తరచూ చలాన్లు విధించేవారు. ఇరుకైన బస్తీలోని తమ ఇళ్ల వద్ద వాహనాలు నిలిపే అవకాశం లేకపోవడంతోనే విశాలమైన రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని పార్కింగ్ కోసం వినియోగిస్తున్నామని చెబుతున్నా వినిపించుకోలేదు. దీంతో బాధితులు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్‌ను కలిసి జీవనోపాధి కోసం ఆటోలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు, ట్యాక్సీలు నడుపుకునే తాము పోలీసు చలాన్ల వల్ల తీవ్రంగా నష్టపోతునామన్నారు. ఈ విషయమై క్రిశాంక్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సూచనల మేరకు ఆదివారం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసుకోవాల్సిందిగా స్థానికులకు సూచించారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించడానికి సహకరించిన క్రిశాంక్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అతిథి అధ్యాపకుల వేతనాలు చెల్లించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కాలేజీలు, గురుకుల విద్యా సంస్థల్లో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలసరి వేతనాలు చెల్లించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య సంస్థల్లో పేద విద్యార్థులకు బోధిస్తున్న అతిథి అధ్యాపకులకు కేవలం 72 గంటల వేతనం చెల్లించడం దారుణమన్నారు. అధ్యాపకులకు చెల్లించే వేతనాలు కుటుంబ అవసరాలు తీరక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ అతిథి అధ్యాపకుల వేతనాల చెల్లింపు పై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

లాలాపేట: బస్తీలో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఓయూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆదివారం 33వ రోజు చేరిన రిలే నిరాహార దీక్షలో రజక సంఘం నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

రైలులో నుంచి జారిపడి వ్యక్తి మృతి

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాకు చెందిన ఉమేష్ యాదవ్ (35), నగరంలో ఉన్న బంధువులను కలిసేందుకు ఈ నెల 5న రైలులో వస్తున్నాడు. చర్లపల్లి నుంచి ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైల్లోంచి నుంచిజారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆలస్యంగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

సొంత నిధులతో బోర్‌వెల్



బోర్‌వెల్ పనులు పరిశీలిస్తున్న క్రిశాంక్

కంటోన్మెంట్: బస్తీల బాధలు తీర్చడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. శనివారం మోండా డివిజన్ లోహియా నగర్‌లో ఏడో బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి బస్తీవాసులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివిధ సమస్యలపై చర్చించారు. ఎత్తయిన కొండ ప్రాంతంలో ఉన్న తమ బస్తీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు చెప్పడంతో వెంటనే సొంత నిధులతో బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం మరోసారి బస్తీవాసులతో భేటీ అయ్యి బస్తీ అభివృద్ధిపై చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు, నూతనంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు బస్తీలోని పలువురికి వృద్ధాప్య, మహిళా పెన్షన్లు రావడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దశలవారీగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని క్రిశాంక్ హామీ ఇచ్చారు. అనంతరం బస్తీవాసుల సమక్షంలోనే నూతన బోర్‌వెల్ వేయించి పంపుసెట్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో డ్యానీ, శ్యామ్, మోని, రఘు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న శ్రీగణేష్

రసూల్‌పురా: తిరుమలగిరి సాయిబాబా హట్స్‌లో సొంత నిధులతో టాయిలెట్ల నిర్మాణం, సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేసి స్థానికుల సమస్యలు పరిష్కరించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు శ్రీ గణేష్ హామీచ్చారు. ఆదివారం ఆయన సాయిబాబా హట్స్‌లో పర్యటించగా టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్నామని.. కొందరికి ఉన్నా శిథిలావస్థకు చేరాయని, అదే విధంగా నీటి సమస్య అధికంగా ఉందని, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానిక మహిళలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన శ్రీ గణేష్ మాట్లాడుతూ.. మడ్‌ఫోర్ట్ హట్స్‌లో సొంత నిధులతో 11 టాయిలెట్లు నిర్మించానని అదే తరహాలో ఇక్కడ కూడా నిర్మించడంతో పాటు శిథిలావస్థకు చేరిన వాటిని మరమ్మతులు చేయిస్తానన్నారు. నీటి సమస్య పరిష్కారానికి మూడు సింటెక్స్ ట్యాంకులు, కుళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇక డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన పైపులైను వేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్, గురుమూర్తి, రాజు.రాకేష్ నాగరాజు, లక్ష్మి, సురేఖ, విజయ పాల్గొన్నారు.

యువ సంఘర్షణ సభకు తరలిరావాలి



శ్రీనివాసులు గౌడ్

లాలాపేట: రాష్ట్రంలోని నిరుద్యోగులందరికి భరోసా కల్పించేందుకు సోమవారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న యువ సంఘర్షణ సభకు వేలాదిగా నిరుద్యోగ విద్యార్థులు తరలిరావాలనీ టీపీసీసీ సెక్రటరీ శ్రీనివాసులు గౌడ్ పిలుపునిచ్చారు. రెండు కోట్ల ఉద్యోగాలిస్తాం అని కేంద్రంలోని బీజేపీ, ఇంటికో ఉద్యోగమిస్తామని రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేందుకు నిరుద్యోగులంతా సిద్ధం కావాలన్నారు. నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకా గాంధీ వస్తున్నారని సికింద్రాబాద్ నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగులు తరలి రావాలన్నారు.

అల్లూరి సేవలు మరువలేనివి

లిబర్టీ: బ్రిటిష్ సామ్రాజ్య వాదులను తరిమికొట్టడంలో అల్లూరి సీతారామరాజు కీలకపాత్ర పోషించారని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్. ఆదినారాయణ వెల్లడించారు. దోపిడీ, అణచివేతకు గురవుతున్న ప్రజలను సమైక్యం చేసి పోరాటం చేసిన గొప్ప యోధుడని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి గడగడలాడించిన యోధుడని తెల్లదొరల పాలన నుంచి ప్రజలు, దేశాన్ని విముక్తి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లీలావతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి పాటుపడాలి

రాంగోపాల్‌పేట్: దేవాలయానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆలయం అభివృద్ధికి ధర్మకర్తల మండలి కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆదివారం సికింద్రాబాద్ గణపతి దేవాలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరిగుట్ట దేవాలయాన్ని అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారని సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఉజ్జయినీ మహంకాళి దేవాలయం, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాలను కూడా ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మహంకాళి జాతర, ఎల్లమ్మ కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. నూతన కమిటీ సభ్యులు వోదెల సత్యనారాయణ, హన్మంతరావు, వజీర్ మోహన్, పల్లె సదానంద్‌గౌడ్, వినోద్‌కుమార్, పద్మజ, జయరాజ్, ఎంకే రామ్మోహన్, సిందం శ్రీశైలం, బండారు సత్యనారాయణ, అశోక్ కుమార్, ఆంజనేయులు, బాబూరావులను, ఎక్స్ ఆఫీసియో సభ్యులుగా నియమితులైన దేవాలయ అర్చకులు బుచ్చి రామయ్యను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కృష్ణ, ఈవో వినోద్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, నాయకులు లాస్య నందిత, నరసింహారావు ముదిరాజ్, నాగేందర్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభం

రాంగోపాల్‌పేట్: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. ఆదివారం వెస్ట్‌మారేడుపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన పీపల్ ట్రీ ప్రీ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠశాలల్లోనే నైతిక విలువలు నేర్పిస్తే ఉత్తమ పౌరులుగా రాణిస్తారని అన్నారు. యాజమాన్యం మల్లేష్ యాదవ్, సంతోష్ యాదవ్, శ్రవణ్ యాదవ్ మాట్లాడుతూ.. అత్యుత్తమ ప్రమాణాలతో ప్లే స్కూల్, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు విద్యను అందిస్తున్నామన్నారు.



నూతన ధర్మకర్తల మండలి సభ్యులతో మంత్రి తలసాని

క్రీడలతో మానసికోల్లాసం



కిట్స్ అందజేస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: క్రీడలకు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతోందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తార్నాకలోని ఆమె కార్యాలయం వద్ద స్థానిక యువతకు వివిధ రకాల క్రీడా సామగ్రి అందజేసి మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువకులు అభిరుచి మేరకు క్రీడలను నేర్చుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, శివశంకర్, మనోహర్, నాగేశ్వర్‌రావు, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు



నాలాలోని వ్యర్థాలను తీస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: కళాసీగూడ నాలాలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఈ నాలాలో బాలానగర్ బస్టాప్ నుంచి ఆర్పీరోడ్‌లోని బ్రిడ్జి వరకు చేపట్టిన పనులను వారం క్రితమే ప్రారంభం అయ్యాయి. సుమారు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ నాలా పరివాహక ప్రాంతంలో మరింత కుంచించుకుని పోయి ఉండటంతో పూడికతీత చేపట్టడం కష్టంగా మారింది. దీంతో మనుషులతోనే నాలాలోని పూడికను తొలగిస్తుండటంతో కొంత జాప్యం జరుగుతుంది. వర్షాకాలం మొదలయ్యే లోపు నాలాలో పూడికతీత పూర్తి చేయాల్సి ఉండగా మరో వారం రోజుల్లో ఈ పనులు పూర్తి అవుతాయని ఏఈ రవీందర్ తెలిపారు. పూడికతీత పనులు పూర్తయితే లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు సమస్య ఉండదన్నారు.

ప్రజలకు అండగా ఉంటా



వైద్య శిబిరంలో పాల్గొన్న శ్రీగణేష్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు తాను అన్ని విధాల అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తానని బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీగణేష్ అన్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ మేరీ చాపెల్ ప్రాంతంలో ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజల మౌలిక వసతుల కల్పన, ఆరోగ్యం కోసం, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తా అన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి, క్లావ్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, బస్తీ నాయకులు సన్నీపాల్, సాయి, మారియో, కార్తీక్, రెజీనా, పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ

బన్సీలాల్‌పేట్: ఢిల్లీలో మహిళా రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళనకు మద్దతుగా బోయిగూడలో ఆదివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక యువతీ యువకులు వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు బోయిగూడ రైల్వే బ్రిడ్జి నుంచి వివిధ ప్రాంతాల మీదుగా ర్యాలీ చేపట్టారు. దేశ రాజధానిలో దేశం తరపున ఆడుతున్న క్రీడాకారులు బహిరంగంగా వచ్చి లైంగింక వేధింపులపై ఆందోళన చేయడం వారి నిరసనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సదరు క్రీడావిభాగం చైర్మన్ తమను లైంగికంగా వేధిస్తున్నారని పెద్ద ఎత్తున రెజ్లింగ్ క్రీడాకారులు ఆందోళనకు తాము సమర్థిస్తూ మద్దతుగా సంఘీభావం తెలుపుతున్నామన్నారు. క్రీడాకారినుల ఆవేదన, ఆందోళనను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పట్టించుకోవాలన్నారు. ర్యాలీలో రవి కిరణ్, ఎల్. వెంకటేశన్, వెంకట్ ముదిరాజ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీరు సరికాదు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వీసీ ప్రొ.సురేష్‌కుమార్ తీసుకుంటున్న విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలపై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ధ్వజమెత్తారు. ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని డిస్కార్స్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఇఫ్లూ కమిటీ ఆధ్వర్యంలో కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. వీసీ ప్రొ.సురేష్‌కుమార్ విద్యార్థి హక్కులను కాలరాసేల నిర్ణయాలు తీసుకోవడం దారుణమని, విద్యార్థి వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన వారిని సెంట్రల్ వర్సిటీలకు వీసీలగా నియమించి జాతీయ విద్య విధానం ముసుగులో విద్యను కాషాయికరణం చేస్తుందని ఆరోపించారు. ఉపకార వేతనాల్లో 58 శాతం కోత విధించి పేద విద్యార్థులను ఉన్నత విద్య దూరం చేస్తుందని ధ్వజమెత్తారు. సమాజంలో మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకే బీజేపీ ప్రభుత్వం డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించారన్నారు.

ఇఫ్లూ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ..

ఇఫ్లూ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులుగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా అభయ్ క్రిష్ణ, ఉపాధ్యక్షులుగా అలెక్స్, అబ్రహాం, సహాయ కార్యదర్శిగా శ్రేష్టభట్టచార్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.